క్లుప్తంగా

ఇంద్రకీలాద్రిపై సరస్వతీ హోమం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మూలా నక్షత్రం పురస్కరించుకుని గురువారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సరస్వతీ హోమం చేశారు. మల్లేశ్వరస్వామివారి ఆలయం సమీపంలోని రుద్ర హోమశాలలో ఆలయ అర్చకులు సరస్వతీ హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షణలో నిర్వహించిన హోమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు. అనంతరం పూర్ణాహుతి చేశారు.

నేడు పింక్ టాయిలెట్ ప్రారంభం

పటమట(విజయవాడతూర్పు): నగరపాలక సంస్థ మహిళలకు ప్రత్యేకంగా బెంజిసర్కిల్ వద్ద జాతీయ రహదారి 16 వెంట రూ. 20 లక్షల అంచనాతో నిర్మించిన పింక్ టాయిలెట్‌ను శుక్రవారం ఉదయం 10.30గంటలకు ప్రారంభిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజ, విజయవాడ మహిళా చైర్‌పర్సన్స్, కోఆప్టెడ్ సభ్యులు, కార్పొరేటర్లు పాల్గొంటారని పేర్కొన్నారు.

జీయర్‌స్వామి ఆశ్రమంలో ఈఓ రామారావు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సీతానగరంలోని శ్రీ చినజీయర్‌స్వామి ఆశ్రమంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామిని దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు గురువారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. స్వామివారి ఆశ్రమంలో జరుగుతున్న పూజా కార్యక్రమాలకు హాజరైన దుర్గగుడి ఈవో రామారావు అమ్మవారి ప్రసాదాలు, పండ్లను స్వామీజీకి అందజేశారు. సనాతన, హిందూ ధర్మ ప్రచారం, దేవాలయాల అభివృద్ధి, దేవస్థానంలో జరుగుతున్న పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలపై ఈవో స్వామీజీకి వివరించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి వార్లకు గురువారం పలువురు చిన్నారులు నృత్యం నీరాజనం సమర్పించారు. ధర్మపథంలో భాగంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నగరానికి చెందిన శ్రీనటరాజ నృత్యాలయానికి చెందిన రోజా, భార్గవి, భవ్య, సింధు, లావణ్య, గోకుల్, దీక్ష, జ్ఞానేశ్వరి, దీక్ష, అమృతలు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య పరీక్షలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): బాలల సత్వర చికిత్స కేంద్రం ఆధ్వర్యంలో గురువారం బాలల దినోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారికి వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ వంటి పలు కార్యక్రమాలు నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయన్నారు. జిల్లా ఎన్‌సీడీ–సీడీ, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ జి.మాధవి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కె.సౌమ్య, డాక్టర్ దత్త శరణ్, పిల్లల మనస్తత్వ నిపుణులు టి. దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం అభినందనీయం

పటమట(విజయవాడతూర్పు): అన్ని దానాల్లో అన్నదానం మిన్నని శివ జ్ఞానపీఠాధిపతి శివాచార్య స్వామి అన్నారు. గురువారం విజయవాడ పాత ప్రభుత్వాస్పత్రిలో అన్న సంతర్పణ సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాల్గొని రోగులకు, రోగుల సహాయకులకు భోజనం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 16,17, 18వ తేదీల్లో ఘంటసాల సంగీత కళాశాలలో తలపెట్టిన సర్ప సుబ్రహ్మణ్య మహాయాగ ప్రచారంలో భాగంగా ఇక్కడికి వచ్చామని, ఇక్కడ ట్రస్ట్ చేస్తున్న అన్నదాన కార్యక్రమం హర్షణీయమన్నారు. ఆకలి తీర్చటం అంటే భగవంతుని సేవించటమేనని చెప్పారు.

డ్రెయినేజీ సమస్య పరిష్కరిస్తా

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



39వ డివిజన్‌లో డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డివిజన్ పరిధిలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. విద్యాధరపురం 39వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పర్యటించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో ఇంకా జరగాల్సిన అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ డివిజన్‌ను మరింత అభివృద్ధి చేయడానికి అధికారులతో కలిసి పర్యటిస్తున్నామన్నారు. కొంతమేర డ్రెయిన్ల సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరిస్తామన్నారు. డివిజన్ పరిధిలోని రోడ్లన్నింటినీ అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రతి సమస్యను తీర్చడానికి చర్యలు చేపడతామన్నారు. నియోజకవర్గంలో కొత్తగా 11 ట్యాంకుల నిర్మాణం చేపట్టామన్నారు. గతంలో కంటే ఇప్పుడు అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందని వివరించారు. మొత్తం నియోజకవర్గంలో 31 వేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర రాఘవ, కొత్తమాసు వెంకట పిచ్చయ్య, ఏలూరు వెంకన్న, జూలూరి నాగభూషణం, డీవీ రెడ్డి, బొండా సాంబ శివరావు, పి.భాస్కర్, ఆర్.వెంకట్, ముంతాజ్ బేగం, నాగమణి, కరిం, రేలంగి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నవజీవన్ బాలభవన్ కో ఆర్డినేటర్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాల బాలికలు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సమాజంలో గొప్పగా ఆలోచనలు చేసి కీర్తి ప్రతిష్టలు తెచ్చుకోవాలని నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ ఎండీ వసంతకుమారి చెప్పారు. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా గురువారం చిట్టినగర్‌లోని కుషాల్ దాస్ జీవన్ దాస్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతకుమారి మాట్లాడుతూ నేటి యువత అందరికీ ఆదర్శంగా ఉండాలని, మంచి ఆలోచనలు, నడవడికతో సమాజానికి, దేశాభివృద్ధికి పాటు పడాలన్నారు. మాదక ద్రవ్యాలు బాలలపై ఎక్కువ ప్రభావం చూపుతాయని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో శ్రుతికి మొదటి బహుమతి, నవీన్‌కు రెండో బహుమతి, అరవింద్‌కు మూడో బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కో ఆర్డినేటర్ డి. విజయరాణి, పాఠశాల ఉపాధ్యాయులు ఆశారాణి, రాఘవులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు పి.స్వప్న మంజరి, కె అరుణకుమారి పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజానికి సేంద్రియ వ్యవసాయం



మాట్లాడుతున్న కేఎల్ యూనివర్సిటీ కార్యదర్శి కోనేరు శివకాంచనలత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన సమాజాన్ని సాధించవచ్చని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ కార్యదర్శి కోనేరు శివకాంచనలత అన్నారు. కేబీఎన్ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ, ఎకో క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయం క్షేత్రాన్ని ఆమె గురువారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయ, మిద్దె తోటల అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జీవాధారిత వ్యవసాయంగా సేంద్రియ వ్యవసాయాన్ని వర్ణించవచ్చన్నారు. ప్రధానంగా ప్రాంతీయంగా లభించే వనరులతో వ్యవసాయం చేయడానికి అధిక ప్రాధాన్యమిస్తూ, హానికర రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించే విధంగా సేద్యాన్ని చేయాలన్నారు. ఇది పెట్టుబడి లేని వ్యవసాయమన్నారు. దేశంలో క్రీస్తు పూర్వం నుంచి బ్రిటీషు పాలన వరకూ సేంద్రియ వ్యవసాయన్నే రైతులు నమ్ముకున్నారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో హరిత విప్లవం మాటున విదేశీ కంపెనీలు తమ కృత్రిమ ఎరువులు దేశంలో విక్రయించారన్నారు. అత్యధిక దిగుబడులు వస్తాయనే భ్రమతో రైతులు రసాయన వ్యవసాయాన్ని ఎంచుకున్నారన్నారు. ఇప్పటికైనా రైతులు సేంద్రియ వ్యవసాయం వైపు మళ్లడం శుభపరిణామమన్నారు. కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాస్ కళాశాలలోని కొంత స్థలాన్ని సేంద్రియ వ్యవసాయం చేయడానికి కేటాయించామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ గృహిణులు మిద్దె తోటలపై అవగాహన పెంచుకోవడంతో కుటుంబ ఖర్చులు తగ్గడంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. వన్ ఎర్త్ వన్ లైఫ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు డి. లీలాకుమారి, శ్యాంప్రసాద్, సురేష్, విజయ్, రవి సేంద్రియ వ్యవసాయం, మిద్దె తోటల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, బోటనీ విభాగాధిపతి అలీబాష తదితరులు పాల్గొన్నారు.

కొండ ప్రాంతాల్లో సమగ్రాభివృద్ధి

కార్పొరేటర్ రత్నకుమారి



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రత్నకుమారి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతాల్లో మెట్లు, డ్రైన్లు, రోడ్ల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నానని 44వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి పేర్కొన్నారు. డివిజన్‌లోని నాలుగు స్తంభాల సెంటర్ ఆర్‌సీఎం చర్చి వద్ద రూ. 5 లక్షల అంచనాతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు గురువారం పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ డివిజన్ పర్యటనలో ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు దుర్గారావు, వీరంకి సత్యనారాయణ, కుంభ జోజి, ఏజీఎల్ నారాయణ, కారంపూడి రఘు, గంజి కొండలరావు, అద్దేపల్లి సత్యనారాయణ, దుర్గారెడ్డి, ప్రసన్న, స్నేహలత, సెక్రటరీ హర్షిత తదితరులు పాల్గొన్నారు.

బాలసాహిత్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న వల్లూరి శివప్రసాద్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రచయితలు బాల సాహిత్యంపై దృష్టి సారించాలని సాహితీవేత్త, నాటకకర్త వల్లూరి శివప్రసాద్ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యాన జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం 'నేటి బాలల కోసం సాహిత్యం' అంశంపై సదస్సును బుక్ ఫెస్టివల్ లైబ్రరీ హాల్లో నిర్వహించారు. శివప్రసాద్ మాట్లాడుతూ బాలల కోసం ప్రత్యేకంగా సాహితీ సృజన జరగాల్సిన అవసరం చాలా ఉందన్నారు. వేటూరి ప్రభాకరశాస్త్రి, చింతా దీక్షితులు, నేదునూరి గంగాధరరావు వంటి ప్రముఖులు బాల సాహిత్యం కోసం చేసిన కృషిని కొనియాడారు. బాలల కోసం సైన్స్ రచనలు చేసిన డాక్టర్ పరుచూరి రాజరామ్, ఆచార్య మైనేని కేశవదుర్గాప్రసాద్ వంటి వారి సాహితీ సృజనను వివరించారు. బాల సాహితీవేత్త భమిడిపాటి బాలాత్రిపురసుందరీదేవి మాట్లాడుతూ బాలల సందేహాలకు సమాధానాలు ఇవ్వగలిగే సాహిత్యం రావాలన్నారు. సభకు డాక్టర్ జీవీ పూర్ణచంద్ అధ్యక్షత వహించారు. సొసైటీ గౌరవాధ్యక్షుడు బాబ్జీ, పబ్లిషర్ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్‌లో భద్రతపై శిక్షణ



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌వర్మ

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లోని ఏపీ జెన్‌కో శిక్షణ కేంద్రంలో సురక్షితమైన భద్రతపై శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏపీ డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చంద్రశేఖర్ వర్మ శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రత పరమైన నియమాలు పాటించకపోవడం వలన అనేక ప్రమాదాలు మానవ తప్పిదంతో జరుగుతున్నాయని చెప్పారు. ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు జీరో స్థాయిలో ఉండేలా భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. పని ప్రదేశాల్లో సైతం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ఫ్యాక్టరీలకు చెందిన 175 మంది శిక్షణకు హాజరయ్యారు. డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాసరావు, సీఈ నవీన్‌గౌతమ్, ఎన్టీటీపీఎస్ అధికారులు పాల్గొన్నారు.

19న వ్యాసరచనల పోటీలు

విజయవాడ కల్చరల్: జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలుకొండ మంగతాయారు స్మారక, సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు పాఠశాల, కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు మహిళా సాధికారిత–నాకు నచ్చిన మహిళ అంశంగా వ్యాసరచనల పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు వి.ఉమామహేశ్వరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంజీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో పోటీలు జరుగుతాయని విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందని, వివరాలకు 63001 22018 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మందికి జైలు, జరిమానా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందికి జైలు, జరిమానా విధిస్తూ ఏడో, ఎనిమిదో అడిషనల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుల న్యాయమూర్తులు కె.సురేష్, వి.విజయ కుమార్ రెడ్డిలు తీర్పు వెల్లడించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె. రాణా ఆదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం తాగి వాహనాలు నడిపే చోదకులపై శుక్రవారం 1, 2, 4వ ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 20 మందిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. వారిలో ఒక్కొక్కరికీ ఒక్కో రకమైన శిక్ష వేశారు. 12 రోజుల నుంచి గరిష్టంగా నెల రోజుల వరకూ జైలు శిక్షతో పాటు ప్రతి ఒక్కరికీ రూ. 10వేలు జరిమానా విధించారు.

'చెస్ మాస్టర్' కుమారస్వామికి.. సీపీ అభినందన

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వరల్డ్ చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిడే ఆరేనా ఇంటర్నేషనల్ మాస్టర్ టైటిల్‌ను గెలుచుకున్న పాలూరి కుమారస్వామి గురువారం పోలీస్ కమిషనర్ టీకే రాణాను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 2020లో జరిగిన జిల్లా టీం చెస్ ఛాంపియన్‌షిప్‌లో ప్రథమ, ఏపీ స్టేట్ టీం చెస్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ బహుమతిని పొంది నేషనల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనడంపై కుమారస్వామిని అభినందించారు. 2021–2022లో తన వద్ద కోచింగ్ తీసుకున్న విద్యార్థులు అండర్–7 నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ గెలుచుకున్నట్లు తెలుసుకుని ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీసీపీ విశాల్ గున్ని కూడా కుమారస్వామిని అభినందించారు.

నేటి నుంచి గొల్లపూడి అయ్యప్ప సన్నిధిలో కార్తిక మాసోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గొల్లపూడి శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం సన్నిధిలో ఈ నెల 17 నుంచి కార్తిక మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ పాలకవర్గ అధ్యక్షుడు గెల్లి మోహనరావు తెలిపారు. నాలుగున్నర దశాబ్దాలుగా కేరళ సంప్రదాయ పద్ధతుల్లో స్వామి వారికి వైదిక కైంకర్యాలు, ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. 2025 నాటికి ఆలయాన్ని నిర్మాణం చేసి 50 ఏళ్లు పూర్తి చేసుకుంటుందన్నారు. 17 నుంచి జనవరి 13వ తేదీ వరకూ మహాదీపార్చన నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబర్ 27 వరకూ మండల పూజా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. జనవరి 14 వరకూ అయ్యప్ప, భవానీ మాలధారులకు అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

వనసమారాధనను జయప్రదం చేయండి

సత్యనారాయణపురం(విజయవాడరూరల్): రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో డిసెంబర్ 3న జరిగే కార్తిక వన సమారాధన కార్యక్రమంలో బ్రాహ్మణ కుటుంబాలు పాల్గొని జయప్రదం చేయాలని బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొప్పవరపు వెంకట బలరామకృష్ణమూర్తి పిలుపునిచ్చారు.

ఈ మేరకు గురువారం సత్యనారాయణపురంలోని గాయత్రి కన్వెన్షన్ హాల్లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా విజయవాడ రూరల్, కొత్తూరు తాడేపల్లిలోని బెన్‌డిక్ట్ స్కూల్ పక్కన ఉన్న మామిడి తోటలో వన సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నగరాభివృద్ధికి ప్రత్యేక కృషి

వీఎంసీ స్థాయీసంఘం సమావేశంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి



వీఎంసీ స్థాయీసంఘం సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడను అంతర్జాతీయ నగరాల మాదిరి అభివృద్ధి చేయటానికి కృషి చేస్తున్నామని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. మేయర్ ఆధ్వర్యంలో గురువారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో స్థాయీసంఘ సమావేశం జరిగింది. మొత్తం 19 అంశాలు అజెండాలో ప్రతిపాదనలు రాగా అందులో 14 అంశాలను ఆమోదించగా రెండింటిపై వాదిస్తూ తీర్మానం చేశారు. ఒక అంశాన్ని రికార్డు చేయగా మరో అంశాన్ని ధ్రువీకరించారు. సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులు, వీఎంసీ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రధానాంశాలివి

- సర్కిల్ 2 పరిధిలోని గవర్నమెంట్ ప్రెస్, సీకే రెడ్డి రోడ్డులో రెండు బ్లాక్ స్పాట్‌లను పోలీసు విభాగం గుర్తించారు. వీటి కారణంగా రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నందున వాటిని నిరోధించడానికి నిర్ణయించారు. బ్లాక్‌స్పాట్‌ల వద్ద రోడ్డు సేఫ్టీ జాగ్రత్తలు, డైరెక్షన్ బోర్డులు, హెచ్చరిక బోర్డులు, సోలార్ బ్లింకర్లు, రోడ్డు మార్కింగ్ ఏర్పాటు చేయటానికి రూపొందించిన అంచనాల మేరకు అయ్యే రూ.43.85 లక్షలు నిధులు కార్పొరేషన్ జనరల్ ఫండ్స్ నుంచి విడుదల చేయాలని వచ్చిన ప్రతిపాదనను సభ్యులు ఆమోదించారు.
- సెంట్రల్ నియోజకవర్గంలోని 60వ డివిజన్ డీస్నీ ల్యాండ్ వద్ద ఉన్న ముస్లిం శ్మశాన వాటికలో కాంపౌండ్‌వాల్, గ్రౌండ్ లెవలింగ్, సీసీ రోడ్డు ఏర్పాటుకు రూ. 48.37 లక్షల నిధులను కార్పొరేషన్ జనరల్ బడ్జెట్ నుంచి కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనను సభ్యులు ఆమోదం తెలిపారు.
- సర్కిల్ 1 పరిధిలోని 40వ డివిజన్‌లో ఎన్టీఆర్ స్ట్రీట్ నుంచి బాలభాస్కర్ స్ట్రీట్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ. 36.91 లక్షలు వీఎంసీ సాధారణ నిధుల నుంచి విడుదల చేయాలని వచ్చిన ప్రతిపాదనను సభ్యులు ఆమోదించారు.
- సర్కిల్ 3 పరిధిలోని 18వ డివిజన్ రాణీగారితోటలో బాలస్వామి వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి అయ్యే రూ.25.52 లక్షలు కార్పొరేషన్ జనరల్ ఫండ్స నుంచి చెల్లించాలని వచ్చిన ప్రతిపాదను ఆమోదిస్తూ తీర్మానం చేశారు.

ప్రజారోగ్యానికి జగనన్న సురక్షతో భరోసా

51వ డివిజన్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష



మందులను అందిస్తున్న వెలంపల్లి శ్రీనివాస్, మేయర్ భాగ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 51వ డివిజన్ పరిధిలోని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. దీన్ని వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. స్థానికుల అభిప్రాయాలను తెలుసుకొని అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సచివాలయం పరిధిలో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో వినియోగించుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో పలువురు వీఎంసీ, వైద్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలుచేసిన జగన్

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



అభివృద్ధి కార్యక్రమాలపై బోర్డును ఆవిష్కరించిన వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలుచేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కొనియాడారు. పాలనలో అడుగడుగునా ప్రజలను మోసం చేసిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం 37వ డివిజన్ పరిధిలోని గాంధీ పార్క్ సమీపంలో ఉన్న సచివాయం సమీపంలో పార్టీ పతాకాన్ని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఎగరేశారు. అనంతరం సచివాలయం పరిధిలో డివిజన్‌లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు వివరాలను తెలియజేసే బోర్డును వెలంపల్లి శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ మండేపూడి చటర్జీతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నూరు శాతం అమలు చేసిన ఘనత తమదేనన్నారు. ఇచ్చిన వాగ్దానాలు తెలియకుండా టీడీపీ వెబ్‌సైట్ నుంచి మేనిఫెస్టోను మాయం చేసిన ఘనత చంద్రబాబునాయుడిదన్నారు. రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం విషయంలో దూసుకుపోతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు జిలానీ, అతీక్ పాల్గొన్నారు.

కల్చరల్ పోటీల్లో శరత్‌చంద్ర విద్యార్థుల ప్రతిభ



ఓవరాల్ చాంప్ అవార్డు అందుకుంటున్న శరత్‌చంద్ర అకాడమీ విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని నలంద డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కల్చరల్ పోటీల్లో శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీలో డిగ్రీతో పాటు ఐఏఎస్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారు. ఆ పోటీల్లో డిబేట్, క్విజ్, ఎడ్యుకేషన్ స్కిట్ వంటి విభాగాల్లో విజేతలుగా నిలిచి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్నారు. విజేతలను గురువారం అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ తోట శరత్‌చంద్ర అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొంటే లీడర్‌షిప్, కమ్యూనికేషన్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ పెరుగుతాయన్నారు. ఇలాంటి నైపుణ్యాలు ఐఏఎస్, ఐపీఎస్ కావాలనుకునే వారికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. అకాడమీ అకడమిక్ ఇన్‌చార్జి కల్యాణ్ దత్త మాట్లాడుతూ కరెంట్ అఫైర‌ పట్టు ఈ విజయానికి కారణమని చెప్పారు. ఈ సంవత్సరం ఐఏఎస్ మెయిన్స్ పరీక్షలో తమ విద్యార్థులు ప్రతిభ కనపరిచారని, ఇంటర్వ్యూ కాల్ కోసం వేచి ఉన్నట్లు తెలిపారు.

నేడు పేరంటాలమ్మ కానుకల లెక్కింపు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ హుండీల్లోని కానుకలను శుక్రవారం దేవదాయశాఖాధికారుల పర్యవేక్షణలో లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. భక్తులు అమ్మవార్లకు కానుకల రూపంలో 56 రోజులకు గానూ హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని లెక్కిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి, సేవాదళ్ సభ్యులు, సిబ్బంది పాల్గొంటారని వెల్లడించారు.

నాగులచవితికి ఏర్పాట్లు

పేరంటాలమ్మ ఆలయ ప్రాంగణంలోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నాగుల చవితిని పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్ తెలిపారు. నాగుల చవితి సందర్భంగా సుబ్రహ్మణ్యస్వామికి భక్తులు స్వయంగా పాలు పోసే సౌకర్యం కల్పించినట్లు వివరించారు.